
# పరీక్షా ఫలితాలు

శ్రీ నోరి నరసింహశాస్త్రి



[ ౧౯-౨౮ ]

౬

ఆశ కేమాత్రము అవకాశ మున్నా దానిమీద ఆధారపడడము మానవస్వభావము. అందువల్లనే పరీక్షరిజల్టు వచ్చిన మర్నాడుకూడా, తప్పిన విద్యార్థులు వార్తాపత్రిక చూస్తారు. ఆరోజు దిద్ది ఉండ గూడదా అని వాళ్ల ఆశ. కాని చంద్రునిది సామాన్య ప్రకృతి కాదు. భయానికి ఏమాత్రము అవకాశమున్నా దాని నధిష్ఠించి దానితో కుంగిపోవడానికి అతడు తనశక్తి అంతా వినియోగిస్తాడు. "వచ్చే టర్ములో బాగా అభివృద్ధి చూపవలెనన్నారు. సంవత్సరం చివరదాకా చదవ నిచ్చి అప్పుడు అటెండెన్సు సర్టిఫికెటు పంపక పోతే మరీ కష్టము కాదండీ!" అనేవాడు. క్రిస్టమసు సెలవులు ఇట్లా గడిచిపోతూ ఉన్నప్పుడే నాబలవంతాన 'విషప్రయోగము' కథ వ్రాయ మొదలు పెట్టినాడు. తన అటెండెన్సు సర్టిఫికెటుమీద ధ్యానం పెట్టుకున్న వాడు 'విషప్రయోగము' ఎట్లా పూర్తిచేస్తాడు?

క్రిస్టమసు సెలవు లైనాక పట్నం వెళ్లినాము. ఆప్రయాణంలోనే అతను, ఉత్సాహంగా ఉన్న ఏదో ఒకక్షణంలో, లా కాలేజీ ముద్దువిద్యార్థుల సంగతి మాట్లాడడమూ, లా కాలేజీ విద్యార్థుల కందరికీ కోపము వచ్చి ఇతను తప్పవలెనని కోరుకోవడమూ తటస్థించినది.

పట్నంలో ఎండ లారంభించినవి. అప్పుడు మే మున్న గది మరీ ఇబ్బంది అనిపించింది. గదులకోసము వెదకినాము. చివరకు ఎక్కువ అద్దె పెట్టి ఒక పెద్దగది తీసుకున్నాము. నాకొత్త అడ్రసు స్నేహితులకూ, మా ఇంటికీ వ్రాసినాను. చంద్రుడుమాత్రము వాళ్ల ఇంటికి ఉత్తరం వ్రాస్తూ పాతఅడ్రసే ఇచ్చినాడు. అది నేను చూడడము తటస్థించి ఏమిటని అడిగితే "అడ్రసు మారి నప్పుడల్లా వ్రాయడ మెందుకు? ఇన్ని అడ్రసులు ఇస్తే ఏ అడ్రసుకు వ్రాయవలెనో తెలియక మావాళ్లు అసలు ఉత్తరమే వ్రాయరేమో! మన పాతగదిలో స్నేహితు లుంటారుగా. ఉత్తరము వస్తే వాళ్లు నా కివ్వరా?" అన్నాడు.

జనవరి నెల గడిచిపోతున్నది. చంద్రునికి కొత్త భయ మొకటి వచ్చినది. అటెండెన్సు చాలదేమో! దసరా సెలవుల కింటికి వెళ్లినప్పుడు ఇంటినుంచి వారంరోజులు ఆలస్యంగా వచ్చినాడు. క్రిస్టమసు సెలవుల తర్వాత మూడురోజు లాలస్యంగా వచ్చి నాడు. ఇంకా అప్పుడప్పుడు ఒకటి రెండురోజులు స్కూలుకు వెళ్లలేదు. ఇవన్నీ కలిసి ముప్పైయైదు రోజులై, అతనికి అటెండెన్సు చాలకపోతుందేమో!

నేను నవ్వినా, వాదించినా, లెక్కవేసిచెప్పినా అతని భయము మాత్రము తీర్చగలిగేవాణ్ణి కాదు.

ఒకరోజున వాళ్లప్రిన్సిపాలు కొందరిని తనతో మాట్లాడి పొమ్మని కబు రంపినాడుట. ఆనోటీసు చూసి తననుకూడా పిలిపిస్తాడేమోననీ, ఫిజిక్సుమాష్టరుతో పోట్లాడినవిషయమేననీ మొదట భయపడ్డాడుట. కాని ఆజాబితాలో తనపేరు లేదని త్వరలోనే తెలుసుకున్నాడు. అటెండెన్సు కాస్త తక్కువగా ఉన్నవాళ్లనట్లాపిలిపించి జాగ్రత్తగా ఉండమనిచెప్పినట్లు తెలిసింది. ఇందువల్ల తనకు అటెండెన్సు ఏమాత్రమూ తక్కువగా లేదని స్పష్టమైనప్పటికీ "ఏమో నన్ను పిలిపించడము మరిచిపోయి ఉండగూడదా? అంతా అయిపోయిన తర్వాత చివరకు తెలిస్తే ఏం జేస్తాము!" అని భయపడసాగినాడు. ప్రతి చిన్నవిషయానికీ ఉలకడము అతని జీవనమేమో!

కాని కొద్దిరోజులకే ఆభయము విచ్ఛేద మైపోయినది. ఎవరెవరికి ఎన్నెన్నిరోజులు అటెండెన్సు ఉన్నదీ జాబితా కాలేజీ బులెటినులో వేసినారు. చంద్రుడు స్కూలుకు వెళ్లనిది పన్నెండురోజులే. ఇక అతను భయపడేందుకే వీలు లేకపోయినది. నే నప్పుడు సందుచేసుకొని "చూశావా, ఊరికే భయపడ్డావు! ఇట్లానేగా నీభయం ప్రతిదీని!" అన్నాను.

"ఏమో, ఎవరికి తెలుస్తుం దేం?" అని సిగ్గుతో చిరునవ్వు నవ్వుతూ చంద్రు డన్నాడు.

సరిగ్గా, అదృష్టవశాత్తుగా, ఈరోజుల్లోనే చంద్రునికి ఉత్సాహకారణాలు అన్నివైపులా కనపడసాగినవి. కొన్నాళ్లబట్టీ వాళ్ల ఫిజిక్సు లెక్చరరు ఎన్నడూ లేని ఆదరము చూప మొదలుపెట్టినాడట. ఆమధ్య వాళ్లంతా ఒక ఫోటోకు కూర్చున్నారు. ఆరోజు చంద్రుడు ఫోటోకు వెళ్లేప్పుడు కులాసాగానే వెళ్లినప్పటికీ బొమ్మలో మాత్రము ఏదో కలవరిస్తూ ఉన్నవాడివలె పడ్డాడు. ఆవేళటి కేదో పరధ్యానంగా ఉండి ఉంటాడు. ఆఫోటో చూచినప్పటినుంచే మొదలుట, వాళ్ల ఫిజిక్సులెక్చరరుగారి ఆదరము. ఆయనను ఆ బొమ్మలో ఏమాకర్షించినదో! అకారణకోపము వచ్చేవాళ్లకు అకారణవాత్సల్యమూ వస్తూఉంటుంది.

చంద్రునికి చదువు బాగా సాగడము మొదలుపెట్టింది. అతని మనోవీథివలెనే చెన్నపట్టణముఆకాశముకూడా నిర్మలంగా ఉంటున్నది. మాకొత్తగది మొత్తాన వసతిగానే ఉంటున్నది. అందులో అతని మొదటికథ ఇన్నాళ్లూ ప్రచురము కాకుండి ఆరోజుల్లోనే 'భారతి'లో ప్రచురణమై వచ్చినది. తనపేరు మొదటిసారి అచ్చులో చూచినప్పుడు గ్రంథకర్తకు కలిగేసంతోషమతని కప్పుడు కలిగినది. 'చంద్రశేఖరం' అని అతనినిండుపేరు స్ఫుటంగా పెద్ద అక్షరాలతో అచ్చుపడ్డది. అది చూచినప్పుడు నాహృదయమే గంతు వేసినది. అన్నిటికీ అనుగుణంగా ఆకథ చదివినవాళ్లల్లా దానిని పొగడసాగినారు. కొంతమంది దానిని పొగడడంతో ఊరుకోక నాకథలతో పోలికలుపెట్టి అతని కథే ఎక్కువ బాగున్న దన్నారు. అందువల్ల అతను కాస్త ఉబ్బకపోలేదు. అందుకు నాకు అతనిమీద కాని, ఇతరులమీద కాని ఏమాత్రమూ ఈర్ష్య కలగలేదు. చంద్రుణ్ణీ, అతనికథనూ పొగడితే నన్నూ, నాకథలనూ పొగడినకంటె ఎక్కువ ఆనందము నాకు కలిగేది.

ఒకనాటి సాయంకాలము ఆకథచదివిన పండితుడు మా గదికికూడా వచ్చి చంద్రుణ్ణి ఎదటనే ప్రశంసించి, ఆకథ అంతా ఒక్కసారిగా వ్రాసి ఉండవలెననే తన ఊహ నిజమనిపించుకొని వెళ్లిపోయిన సంగతి వెనకనే చెప్పినాను. మరీ ఆరాత్రి ఆసంతోషముతో చంద్రుడు గంటసేపు చదువుకూడా చాలించి ఆ పెద్దమనిషి సంగతే మాట్లాడినాడు.

౨

ఆమర్నాడు పొద్దునే మాగదికి చంద్రుని చిన్ననాటి స్నేహితు డొకడు వచ్చినాడు. అతని పేరు ఉచ్చరించ నని నాకొక ప్రతిజ్ఞ ఉన్నది. కాని ప్రస్తుతము నియమభంగము చేసుకోక తప్పదు. వెంకటరామయ్య పొడుముకాయవలె పొట్టిగా, నల్లగా ఉంటాడు. ఇంతకంటె అతని విషయము నేనేమీ

మాట్లాడగూడదు కాని ఈ మధ్య చంద్రుడు చెప్పిన అతని కథ ఒకటిమాత్రం నాలో ఆగడంలేదు.

మన జనసామాన్యములో పచ్చదనమూ, ఎఱ్ఱదనమూ చక్కదనానికి పర్యాయపదా లయిపోయినవి. దేశాభిమానం కోసమైనా మనము నల్లదనము అందమనము. తెల్ల వాళ్ల రంగును చాలామంది నిరసిస్తారు కాని మనస్సులలో వాళ్లు దాని ఆకర్షణను ఎరగని వాళ్లు కారు. వెంకటరామయ్యా ఈ శషభిషలేమీ పెట్టుకోక తెల్లదొరసానులను పొగడుతూ ఉంటాడు. ఒకసారి తెల్లదొరసాని ఒకతె అతనితో "మీ దేశములో నల్లనివాళ్లు మా కెక్కువ బాగుంటారు" అన్నదిట. కారునలుపుకూ, తెలుపుకూ ఏమి అన్యోన్యాకర్షణ మున్నదో మనకు తెలియదు. ఏది ఎట్లా ఉన్నా ఆ తెల్లదొరసాని అట్లా మాట్లాడినప్పటినుంచే వెంకటరామయ్యా వాళ్ల అందాన్ని పొగడడము సాగించింది! అప్పటినుంచే, ఏమాత్ర మవకాశ మున్నా, వాళ్లను చూడడానికి పోవడము! ఇది మొదటిసారి విన్నప్పుడు మన చంద్రుడు "ఓరి పిచ్చివాడా, నిన్ను దివాలా తీయడానికి అది అట్లా అన్నదేమోరా" అన్నాడు. వెంకటరామయ్యా కోపముతో వెలాతెలా పోయినాడుట. "మన దేశంలో ఎవరూ అతన్నీ, అతనిరంగునూ పొగడక నాకో ఆపరేషను చేస్తే అతను అంతమాత్రము తెల్లవాళ్ల అందాన్ని పొగడడము తప్పా? నీవెందుకతనితో అంత కఠినంగా మాట్లాడవలె!" అని చంద్రశేఖరాన్ని నా కీమధ్య ఈసంగతి చెప్పినప్పుడు నేను కోపపడ్డాను.

పాపము, మాగదికి వచ్చినప్పుడు వెంకటరామయ్యా తెల్లదొరసానుల అందముసంగతి మాట్లాడే స్థితిలో లేడు. మన్నెపుజ్వరముతో బాధపడుతూ రెండు రోజులబట్టీ లంకణము చేస్తున్నాడు. అతను ట్యుటోరియలు కాలేజీలో చదువుతూ రాజమహేంద్రవరము సెంటరుకు దరఖాస్తు పెట్టినాడు. పదిరోజుల్లో ఇంటికి వెళ్లి అక్కడినుంచి రాజమంద్రి వెళ్లుదా మనుకుంటూఉండగానే ఈజ్వరము వచ్చి ప్రయాణం తొందరచేసింది. ఆరోజే ప్రయాణం కాదలచుకొని డబ్బులేక చంద్రునివద్ద పదిరూపాయలు బదులు తీసుకుందా మని వచ్చినాడు. చంద్రునివద్దకూడా పైకము లేక నాదగ్గర తీసుకొని ఇచ్చినాడు. ఆరోజుకూడా అతను లంకణము చేతా మనుకొన్నాడు కాని నేనే బలవంతపెట్టి మాహోటలులో పథ్యంగా భోంచేసేట్లు చేసినాను. భోజనము చేసినతర్వాత అతనికి కాస్త ఓపిక చేరుకున్నది.

అప్పుడు మళ్లీ వెంకటరామయ్యా చంద్రునితో కలిసి మాగదికి వచ్చినాడు. నేను టాగూరు కథల పుస్తకమేదో చదువుకుంటూ కూర్చున్నాను. వాళ్లేమేమో మాట్లాడుకున్నారు. పరీక్షరోజుల్లో విద్యార్థులు ఒకరి నొకరు కలుసుకొన్నప్పుడు ఎట్లా చదువుతున్నా వని ఒకరి నొక రడగడము ఆచారము. ఎంత బాగా చదువుతున్నప్పటికీ ఆ ప్రశ్నకు జవాబుగా "ఏమోరా, ఏమీ చదవడము లేదు" అనడము కూడా ఆచారమే. అట్లా అనకపోతే అవతలివాడు "నీకేంలే, ఫస్టుక్లాసులో ప్యాసవుతావు" అంటాడు. అటువంటి మాట పడడముకంటె మన విద్యార్థికి అవమాన మింకొకటి లేదు.

మన చంద్రుడికీ, వెంకటరామయ్యకూ కూడా అటువంటి సంభాషణే జరిగింది. కాని చంద్రుడు సంప్రదాయానికి కొంచెము విరుద్ధంగా "ఇంగ్లీషు ఫరవా లేదు కాని ఆప్షనల్ సబ్జక్టులవిషయము ధైర్యం లేదు" అన్నాడు. వెంకటరామయ్య హిస్టరీ మొదలైన తన సబ్జక్టులు ప్యాసయినాడు. ఇంగ్లీషే కావలసిఉన్నది. కాబట్టి వాళ్లిద్దరూ ఆపైన ఇంగ్లీషులో ఏమేమి ప్రశ్నలు రావచ్చునో, ఎట్లా ఎట్లా జవాబులు వ్రాయవలెనో మాట్లాడుకుంటూ కూర్చున్నారు.

నేను టాగూరుపుస్తకము పూర్తి చేసేప్పటికి వాళ్లసంభాషణకూడా పూర్తి అయింది. అప్పుడు మా సంభాషణలో ఏదో సందర్భంలో కొత్తగా అచ్చయిన చంద్రుని కథసంగతీ, అప్పు డచ్చవుతున్న ఇంకొక రెండుకథల సంగతీ ప్రస్తావము రాక తప్పింది కాదు. అప్పటిదాకా వెంకటరామయ్యా చంద్రుడు కథలు వ్రాస్తున్న సంగతి ఎరగడు.

అతని స్నేహితుని ఎదట తన కథల సంగతి మాట్లాడడముచేతనూ, ఆవెనకటిరోజుననే పండితుడు

మాగదికి కూడా వచ్చి అతని కథను పొగడిపోవడము చేతనూ ఈమధ్య కాస్త ఉపశమించిఉన్న కథనోత్సాహము చంద్రునిలో మళ్లీ మొలకెత్తినది. వెంటనే నేను అది కనిపెట్టి "అప్పుడు పూర్తిచేయకుండా ఉన్న 'విషప్రయోగము' ఇవ్వాళ పూర్తిచేస్తావా ఏమిటి? ఒక్కరోజుతో చదువు ముంచుకుపోయే దేమిటి?" అన్నాను.

"ఇప్పుడు వ్రాయలేనండీ" అన్నాడు చంద్రుడు.

"ప్రయత్నం చేయలేవా?" అన్నాను.

"ఏమి లాభము? వ్రాయలేను" అని చంద్రుడన్నమీదట నేను ఒత్తి అడగడము చాలించినాను. ఆ 'విషప్రయోగము' కథ నాటికీ నేటికీ పూర్తికానే లేదు.

నేనప్పుడే పూర్తిచేసిన టాగూరు పుస్తకములో చంద్రుడు వ్రాతా మనుకొన్న కథలాంటిదే ఒకటి ఉన్నది. చంద్రుడు కథ వ్రాయలేడని తెలిసిన తర్వాత ఆకథా, ఇంకో మూడు చక్కని కథలూ గుర్తుపెట్టి "ఇవి మాత్ర మన్నా చదువు, కథ వ్రాయకపోతే వ్రాయకపోయినావు! మళ్లీ పుస్తకము సాయంత్రానికే ఇచ్చివేయవలె" అన్నాను. చంద్రుడాకథలు చదివి మెచ్చుకున్నాడు. ఆ ఉత్సాహంలో నేను గుర్తుపెట్టినవే కాక, ఇంకా రెండు ఇతరకథలుకూడా చదివినాడు.

కాస్త విశ్రాంతి తీసుకొని సాయంత్రంనుంచీ వెంకటరామయ్య వెళ్లిపోయినాడు.

౨

వెంకటరామయ్య వెళ్లి వారమురోజు లైనది. ఆరోజున నేనింటికి త్వరగా వచ్చి నాకువచ్చిన ఉత్తరాలకు జవాబులు వ్రాసి చంద్రుడింటికి వచ్చేవేళ కాగానే అతనికి వచ్చిన ఉత్తర మియ్యడానికి అతని రాకకు నిరీక్షిస్తూ ఉన్నాను. వ్యవహారపు ఉత్తరాలు ఎక్కువ వ్రాయనివాళ్లకు వచ్చే ఉత్తరాలు సామాన్యముగా ప్రేమాస్పదులు వ్రాసినవై ఉంటవి. అందువల్ల ఆ ఉత్తరాలు ప్రేమసందేశాలుగా ఉంటవి. నేనారోజున చంద్రునికా ఉత్తరమిచ్చి సంతోషము కలిగించడానికి ఎదురు చూస్తూ ఉన్నాను.

అట్టి సమయంలో చంద్రుడు వచ్చినాడు. అతను వాకిట్లో అడుగుపెట్టీపెట్టడంతోనే ఆ ఉత్తరమతని కళ్లబడ్డది. అది చూసీచూడడంతోనే అకస్మాత్తుగా అతని ముఖము వికృతమైనది. ఎండలో నడిచి రావడమువల్ల కలిగిన చెమట మరింత ఎక్కువైనది. కొంచెము కంపిస్తూఉన్న కంఠముతో అతను "ఈఉత్తరమిక్కడి కెట్లా వచ్చినది?" అంటూ ఆ ఉత్తర మందుకొనేప్పుడు అతని చేతులు వణుకుతున్నవి. నేను నిర్ఘాంతపోయి చూస్తున్నాను.

అతను అది చదువుతున్నంతసేపూ నిలువెల్లా నీరసమైనాడు. ఉత్తరము చిన్నదే ఐనప్పటికీ, ఆ అడావిడిలో అక్షరాలు స్పష్టముగా గోచరించక కాబోలు, ఎంతోసేపు చదువుకున్నాడు. ఉత్తర మొకసారి పూర్తిచేసిన తర్వాత మళ్లీ తిప్పి ఒకటి రెండు పర్యాయములు చదివినాడు.

చిరకాలము గాఢమైన అనురాగాదరములు కలిగి అతి కోమలస్వభావులతో కలిసిఉన్న తర్వాత వారి భావములు తెలుసుకోడానికి వాళ్లు పలికే మాటలు వినవలసిన అవసరము లేదు. వాళ్ల ముఖభంగులే ఒకొక్కప్పుడు మాటలకంటె స్పష్టతరముగా వాళ్ల భావములను వ్యక్తీకరిస్తవి. రెండు నిముషాలు అతని వంక నేను ఆదుర్దాతో చూచేసరికి అతను చదువుతున్న ఉత్తరముసారాంశము నాకు బోధపడ్డది.

అతను వాళ్ల ఇంటికి తన కొత్త అడ్రసు ఇయ్యలేదుగదా! ఈ అడ్రసుకు వాళ్ల నాన్నగారి దగ్గరనుంచి ఉత్తరము రావడమువల్లనే దస్తూరీ గుర్తుపట్టి ఉత్తరము చూసీచూడడంతోనే అతడు కంపించినాడు. ఉత్తరములోపలకూడా కోపిస్తూ ఉన్న మాట లున్నవి. గదులు ఊరికే మారుస్తూ ఉన్నావేమనీ, కథలు వ్రాస్తూ చదువు పాడుచేసుకోవద్దనీ అందులో ఉన్నదనుకొన్నాను. కాని నాకా ఉత్తరము చూపమనిగాని, సారాంశము చెప్పమనిగాని అడగవలెననే ఊహకూడా నాకు రాలేదు. అతనూ ఆవిషయ మేమీ మాట్లాడలేదు.

మళ్లీ ఆరోజునుంచి అతని హృదయాకాశాన కాలమేఘ మావరించినది. వెనకటికంటె ఏమాత్రమూ ఎక్కువ చదవలేకున్నాడు. కాని ఆవిషయమైన ఆదుర్దా, పరీక్షను గూర్చిన భయమూ అతిశయింప సాగినవి.

జ్వరము తగిలినట్లు ఆరోజునుంచీ రాత్రిళ్లు అతని ఒళ్లు వేడిగా ఉండసాగినది. ఐనా వెనకటివలెనే చదువుతూ అంతకంతకు తక్కువనిద్ర పోతున్నాడు. నాకు ఆదుర్దా ఎక్కువయింది. ఇట్లాగే పరీక్షలదాకా ఉంటే పరీక్షకు కూర్చోగలడా అనిపించింది. అతను మందైనా తీసుకోవడం లేదు.

ఒకరోజున అతనికి తీవ్రమైన జ్వరం వచ్చింది. ఆరాత్రికూడా చదువుతూనే ఉన్నాడు. అప్పుడు నేను పట్టలేక "ఇట్లా ఉంటే నీవు పరీక్షనాటికి మూలపడతావు, వైద్యుణ్ణి ఐనా చూడు!" అన్నాను. అతను తన ఆరోగ్యవిషయములో చూపుతున్న అశ్రద్ధకు నాకు దిగులే కాక కోపముకూడా వచ్చింది.

నా ప్రశ్నకు జవాబు చెప్పినప్పటి అతని కంఠస్వరము ఇప్పటికీ నా చెవులలో ఘోషించి హృదయభారము కలిగిస్తున్నది.

"వైద్యు డెందుకండీ! పరీక్ష ప్యాసుకానిదానికి!" అన్నాడు. పరీక్ష చదువుకూ, వైద్యానికీ హీనముగా సంబంధము కల్పించినాడేమా ఇతనని మొదట నా కసహ్యము వేసినది. కాని ఒక్కక్షణములోనే అతని మనోవ్యథ నాకు గోచరించినది. అప్పటికి నే నేమీ మాటలాడ లేకపోయినాను.

ఆరోజు రాత్రి పదిగంట లైనది. నేను నిద్రపోవడానికి పక్క వేసుకొని పడుకున్నాను. చంద్రు డింకా చదువుతూనే ఉన్నాడు. నాకు నిద్ర పట్టలేదు. చంద్రుని సంగతే ఆలోచిస్తూఉన్నాను.

అప్పుడు నాకొక ఊహ తోచింది. వెంటనే నేను లేచి చంద్రుని పరుపుకూడా పరిచి "చంద్రా, నీ విహ పడుకో" అని ఆదర ముట్టిపడే స్వరముతో అన్నాను. అతను తలఐనా ఎత్తక, జవాబుచెప్పక చదువుకుంటూనే ఉన్నాడు. నాకు కన్నుల నీళ్లు గిఱ్ఱున తిరిగినవి.

అంతట నేను దగ్గరకు పోయి అతని రెండు చేతులూ పట్టుకొని "నీకు జ్వరము వేగిపడుతున్నది! ఇవ్వాళిటికి నామాట విని ఇంతటితో పడుకో! నీకు చదివినది వంటపట్టదు కూడాను" అన్నాను. ఆమాటలు మాట్లాడుతూ ఉన్నప్పుడు నాకు డగ్గుత్తిక పడ్డది.

చంద్రుడు నెమ్మదిగా చేతులు వదిలించుకొని "మీకు తెలియదుకాని, మీరు నిద్రపోండి!" అన్నాడు.

ఇంత ఆరోగ్యవంతుణ్ణీ ఏమీ చేయలేకపోయినాను. నా కేమీ తోచక అతనివంక ప్రేమఒలికే చూపులతో తీక్ష్ణముగా చూడసాగినాను. అత నప్పుడున్న స్థితిలో నన్ను తిట్టినా నాకు కోపము వచ్చేది కాదేమో! కాని తిట్లకంటె క్రూరమైన నిశ్శబ్దముతో అతను తలవంచుకొని చదువుకో సాగినాడు.

ఎంతసేపు చూసినా నాచూపు నిష్ప్రయోజనమైనది. చివరకు విసిగి లేస్తూ "ఐతే నీ విప్పుడు పడుకోవా?" అని కఠినంగా అన్నాను. ధ్వని కఠినంగా ఉన్నదే కాని నా హృదయ మప్పుడు ఆర్ద్రమై ద్రవిస్తున్నది. నా కంఠధ్వనిలో ఏదో అతన్ని ఆకర్షించగా తల ఎత్తి చూచినాడు. నాకళ్లనిండా నిండిన నీళ్లమీద అతనిదృష్టి పడ్డట్లున్నది. అతను నావంక తదేక దృష్టితో కొంతసేపు చూసి చివర కేదో మహా నిశ్చయము చేసుకున్నవానివలె "అయ్యో, మీరు నా కోసము ఆదుర్దాపడక నిద్రపోండి. రేపు డాక్టరుకు చూపిస్తాను, ఇక సరేనా!" అని యథాప్రకారము తలవంచుకొని చదువు సాగించినాడు.

అంతట నేను రభసముగా అక్కడినుంచి లేచిపోయి నా పక్కమీద పండుకొన్నాను. అప్పటికీ చంద్రుడు నిశ్చలముగా చదువుకుంటూనే ఉన్నాడు. ఎప్పటికి నాకు నిద్రపట్టినదో, ఎప్పుడు చంద్రుడు చదువు చాలించినాడో నాకు తెలియదు.

నా కెంత ప్రేమ ఉన్నదో అంత అహంకారమూ, అభిమానమూ కూడా ఉన్నవి. ఆరాత్రి నన్ను కన్నీళ్లు కార్చేట్లు చేసినాడే, చివర కింత అమూల్యమైన కన్నీళ్లు కార్చినా నామాట పెడచెవినిబెట్టి నన్నవ

మానపరచినాడే అని నాకు విచిత్రమైన కోపము కలిగినది. అందువల్లనే మర్నాడు పొద్దున చంద్రుడు డాక్టరుదగ్గరకు వెళ్లడము నేను జ్ఞాపకము చేయలేదు. అతనూ వెళ్లలేదు. అందామని ఎన్నోసార్లు నోటిదాకా వచ్చింది కాని ఆపూట నా అహంకారమే జయించింది.

ఆ మధ్యాహ్నమే మా ఊరినుంచి నా ముఖ్య స్నేహితుడు వ్రాసిన ఉత్తరంలో ఇలా ఉన్నది:

"...............

నీవు చంద్రశేఖరాన్ని చెడగొట్టుతున్నావనీ, అతను కథలు వ్రాయడంతో ఏమాత్రమూ చదవడం లేదనీ, ఆష్ట నల్సులో ప్యాసు కానని అతనే చెప్పినాడనీ వెంకటరామయ్య అనే పెద్దమనిషి వాళ్ల నాన్నగారితో చెప్పినాడట. కోపిస్తూ వాళ్ల నాన్నగారు చంద్రశేఖరానికి ఉత్తరం వ్రాశారట. ఆ వెంకటరామయ్య అనే దుర్మార్గుడు ఎవరు ? నీ సహవాసము వల్ల ఎవరూ చెడిపోరే, బాగుపడతారు గాని!"

ఆ భాగము చదివేటప్పటికి నా దేహములో నెత్తురంతా శిరస్సుకెక్కింది. వెంటనే చంద్రునికి ఉద్రేకముతో వినిపించినాను. అన్నివిషయాలూ తేలినవి. చంద్రుడి నాన్నగారికి నేను పెద్ద ఉత్తరం వ్రాసినాను. కాని ఇంతలో నా అహంకారము వచ్చినది. నేను చేసే పనులకు కారణము మా నాన్నగారికే చెప్పనివాణ్ణి చంద్రశేఖరముతండ్రిగారికి వ్రాయడము నా గౌరవానికి భంగకరమనిపించినది. "నా సద్భావము వారే తెలుసుకుంటారు! లేకపోతే మాత్రము నష్టమేమి!" అనుకున్నాను. ఇట్లా అనుకొని ఆ ఉత్తరము పోస్టులో వేయలేదు.

ఆ సాయంత్రము నేను షికారు వెళ్లుతూ ఉంటే చంద్రుడు తానుకూడా వస్తానని బయలుదేరినాడు. అట్లా వస్తే అన్యాయముగా నొచ్చిన నామనస్సుకు కొంత శాంతి వస్తుం దనుకున్నాడేమో!

"రోజూ జ్వరం తగులుతున్న నీవు బయటికి రావడము మంచిది కాదు. అందులో సముద్రతీరానికి అసలు రాగూడదు" అన్నాను.

చంద్రుడు ఆదరంతో "మీ కట్లా కనపడుతుంది కాని నాకు జ్వరం రావడంలేదు. ఊరికే కొంత ఒళ్లు వేడిగా ఉంటున్నది. ఐనా మన మెక్కువ దూరము వెళ్లవద్దులెండి!" అన్నాడు.

చంద్రుడు రావడానికి నిశ్చయించినట్లున్నాడు. నేనిక రావద్దంటే, పట్టుదలకు, నేను వెళ్లినదోవను కాక ఇంకోదోవను వెళ్లుతాడని తెలుసుకొని అతని రాకకు సమ్మతించినాను. అతనూ ఉల్లాసముగానే బయలుదేరినాడు.

బీచివద్దకు వెళ్లినాము. అప్పుడు చంద్రుడు మాకు ఎదురుగా వస్తున్న ఇద్దరిని చూపి "వాళ్లే మా కెమిస్ట్రీ ఫిజిక్సు లెక్చరర్లు" అన్నాడు.

అందులో జోక్యము లేనివానివలె "అట్లాగా!" అన్నాను.

వాళ్లు దగ్గిరికి రాగానే చంద్రుడు నమస్కరించినాడు. వాళ్లల్లో ఒకాయన "బాగా చదువుతున్నావా?" అని ఇంగ్లీషులో ప్రశ్నించినాడు. "బాగానే చదువుతున్నా" నన్నాడు చంద్రుడు. అంతట వాళ్లేదో మాట్లాడుకుంటూ మమ్మును దాటిపోయినారు.

నా ధోరణిని నే నేదో మాట్లాడుతున్నాను. ఇంతలోకే చంద్రుడు చిరునవ్వుతో "మా ఫిజిక్సు లెక్చరరు అంటున్నది విన్నారా?" అన్నాడు. చంద్రుడి ఆ చిరునవ్వును చూస్తే నాకు భయము. అటువంటిచిరునవ్వు అతని భవిష్యద్బాధాసూచకము.

"లేదు" అన్నాను.

"ఎట్లా ఉన్నాడని నా సంగతి కెమిస్ట్రీ టీచరడుగుతే ఫిజిక్సుటీచరు 'గోడమీద ఉన్నా' డని చెప్పుతున్నాడు."

"వాడిమొఖం" అన్నాను నేను.

"దానికేం లేండి! ఆయనకు తోచింది ఆయన చెప్పినాడు!"

"సరేకాని నామాట విను. వీళ్లకు నీవు ప్యాసవుతా వనికూడా ధైర్యము లేదు కాబట్టి ముఖ్యంగా ఫిజిక్సులో డిస్టింక్షను తెప్పించుకోవాలె!" అన్నాను.

"నా మొహం! నేను ప్యాసయితే చాలులేండి!" అన్నాడు. చంద్రుడికి అహంకార మున్నదన్న లా కాలేజీవిద్యార్థులు ఆమాటలు విని అప్పటి అతని ముఖం చూసిఉంటే బాగుండేది.

హాలుటిక్కెట్లు ఇచ్చే రోజులు వచ్చినవి. నెంబర్లు శుభమైనవీ, అశుభమైనవీ ఉంటవని విద్యార్థులు అనుకుంటూ ఉంటారు. వాళ్లు అది నవ్వుతూనే అన్న ప్పటికీ వాళ్లకే చెడ్డనెంబరు వచ్చినప్పుడు మనస్సులలో ఎంత బాధపడతారో తెలుస్తే నవ్వు రాకతప్పదు. నెంబరు మంచీ చెడ్డా తేల్చడానికి నానా విద్యార్థులలో నానామతా లున్నవి. అది నాలుగుచేత నిశ్శేషముగా విభాజ్యమై ఉండవలెనని కొంతమందీ, రెండుచేతనైతే చాలు—సరిసంఖ్యగా ఉండడమే ప్రధాన మని కొంతమందీ, ఎనిమిదింటిచేత విభాజ్యమై ఉండవలెనని మరికొందరూ అంటారు. కాని ఏడూ, సున్నల విషయములో అభిప్రాయభేదాలు లేవు. చంద్రుని కిటు వంటిదేదో తటస్థపడవచ్చు ననీ, ముందుగానే జాగ్రత్త చేయవలెననీ ప్రయత్నం చేసినాను. అవన్నీ వ్యర్థభయ ములని నేనంటే చంద్రుడు "లేకపోతే ఏమిటి!" అని బలముగా అన్నాడు. ఐనా ముందే జాగ్రత్త చేయడము కోసము "ఏడు చెడ్డ సంఖ్య అని తెలుగుదేశంలో తప్ప మరెక్కడా ప్రతీతిపడలేదు. అది ప్రతిదేశము లోనూ మంచిసంఖ్య కూడాను. ఇక సున్నలోనుంచే కొందరు ఓంకారమునూ, పరబ్రహ్మమునూ ఉద్భవించి నట్లు రూపించినారు." అని ఈ విధముగా ప్రసంగించి నాను. చంద్రుడు పోయి హాలుటిక్కెట్టు తెచ్చుకు న్నాడు. నేను భయపడ్డట్లే ఏడూ, సున్నా లున్న సంఖ్యే వచ్చింది. మునుపు ఇదంతా విని నవ్వినప్పటికీ శుభా శుభసంఖ్యల సిద్ధాంతముల సంగతీ, వాటికీ తన సంఖ్య కూ ఉన్న సంబంధముసంగతీ ఆరోజు కొన్ని గంటల సేపు నాతో చంద్రుడు మాట్లాడక ఊరుకోలేదు.

హాలుటిక్కెట్టులో అతనినెంబ రెట్లా ఉన్నా అది చూడడంతో చంద్రునికి ఒక భయము తీరింది. ఫిజిక్సులో రెండవ టర్ము జాగ్రత్తగా ఉండకపోతే అటెండెన్సు సర్టిఫికెటు పంపమన్న బెదిరింపుభయం ఇక లేదు. "కాబట్టి నా అటెండెన్సు సర్టిఫికెట్టు పంపినా రన్నమాట!" అన్నాడు చంద్రుడు, చేతులో హాలుటిక్కెట్టు పట్టుకొని.

కాని దురదృష్టపు చంద్రునికి దెబ్బలు అంతటితో ఆగలేదు. జ్వరము రావడ మాగిపోయినది కాని ఆరోజు కారోజుకు క్షీణించిపోతున్నాడు. మనిషికి వికృతాకారము పడుతున్నది.

పరీక్ష నాలుగురోజు లున్నది. నేను మధ్యాహ్నము ఒకానొక స్నేహితునివద్దకు వెళ్లి వచ్చేటప్పటికి చంద్రుడు చేతులో ఒకకార్డు పట్టుకుని కొంచెము చిన్నబోయిన ముఖంతో నవ్వుతూ "ఇప్పటికీ మా నాన్నగారు నేను బాగా చదవడం లేదనే అనుకుం టున్నట్లున్నారు. బాగా చదివి ఆప్షనల్సులోకూడా ప్యాసు కావలసినదని ఉత్తరము వ్రాశారు" అన్నాడు.

అప్పుడు నే నేమీ మాట్లాడలేదు. ఆదరముతో అతన్ని చేరి, ఆమధ్య సరియైన సంస్కారము లేక చిక్కుపడిఉన్న అతని క్రాపింగు స్వాధీనమైనంత వరకూ దువ్వినాను. కాని భూమ్యాకాశము లన్నీ ఈ కుఱ్ఱవాణ్ణి పరీక్ష తప్పించవలెనని ప్రయత్నం చేస్తు న్నట్లు నా కప్పుడు పొడకట్టక తప్పిందికాదు. ఇంత సుకుమారునిమీద లోకానికి అంత కసి ఎందుకో!

౬

ఆఖరుకూ, చంద్రుని పరీక్ష రోజు వచ్చినది! కనపడకుండా పిశాచమువలె ఇన్నాళ్లబట్టీ వెంటబడి చంద్రుణ్ణి బాధిస్తూ ఉన్న పరీక్ష ఎట్లాగో అట్లా కొద్ది రోజుల్లో ఐపోతుందిగదా అని నిద్రలేవగానే నాకు తోచి, భారము తీరినట్లు నిట్టూర్పు విడిచినాను.

ఆరోజు చంద్రుడు శుభ్రంగా తలదువ్వుకొని శుభ్రమైన బట్టలు చక్కగా కట్టుకొని నవ్వుమొగంతో పరీక్షకు వెళ్లినాడు. అతని ఫౌంటెనుకలములలో జాగ్రత్తగా నేనే సిరా పోసి ఇచ్చినాను. నేనూ మా కాలేజీకి వెళ్లినాను. కాని నా మనస్సు వింటున్న ఉపన్యాసాలమీదకంటె చంద్రునిమీదనే ఎక్కువగా ఉన్నది. "ఇప్పటికి పేపరు చూసుకుని జవాబు వ్రాయ మొదలుపెట్టి ఉంటాడు — ఇప్పటికి సగము పేపరు బాగా

వ్రాసి ఉత్సాహంగా ఉంటాడు — ఇప్పటికి పేపరు పూర్తిచేసి హాలులోనుంచి బయటికి వచ్చి ఉల్లాసంగా కాఫీకి వెళ్లుతూ ఉంటాడు —” ఎంత ఆపినా ఆగక నాబుద్ధి ఇటువంటి ఊహాలతో చంద్రునివద్దకు పరుగు లెత్తుతున్నది.

ఆరోజు సాయంత్రము ఎంత ఉత్కంఠతో అతని రాకకు ఎదురుచూచినానో ఊహించుకోవచ్చును. సంస్కృతకావ్యాలలోని వాసకసజ్జికాది శృంగార నాయికలు జ్ఞాపకం రాగా నాలో నాకే నవ్వువచ్చినది.

చివరకు నవ్వుతూ వచ్చినాడు. “అన్ని పేపర్లూ ఇట్లాగే ఉంటే మీ రన్నట్లు నాకు ఫస్టుక్లాసు తప్పదు” అన్నాడు.

నాకు ధైర్యము కలిగినది. మొదటిరోజు పేపర్లు బాగా ఉంటే చంద్రుడు మిగిలినవి ధైర్యంగా వ్రాస్తా డని నాకు తెలుసును.

మర్నాడు సాయంత్రముకూడా ఏమి చేయడానికీ తోచక చంద్రుని రాకకు నిరీక్షిస్తూ ఉండగా అతను బిక్కమొగంపెట్టుకొని కొస్త ఆలస్యంగా వచ్చినాడు. నా కాశ్చర్యమయింది.

“బాగానే వ్రాశా నని సంతోషిస్తూ వచ్చానండీ! కాని దోవలో తెలిసింది. ఈ ప్రశ్నకు ఒక్క పేజీ మించకుండా జవాబు వ్రాయ మని ఉంటే చూడక మూడు పేజీలు వ్రాసి వచ్చానండీ! ఇక ఇంగ్లీషులోకూడా ప్యాసుకావడ మనుమానమే” అన్నాడు.

“నీవు అనుమానించ మొదలుపెట్టితే రేపు తెలుగు కాంపోజిషనుకూడా అనుమానమే”అన్నాను.

“అది మాత్రము ఎవరికి తెలుసు! ఇప్పటికి కొస్తైనా చదవలేదు. అయినా ఈ ఇంగ్లీషు ప్యాసు కావద్దూ?” అన్నాడు.

“చెడిపోయినది ఒక ప్రశ్నేగదా! నిన్న రెండు పేపర్లూ, ఇవ్వాళ ఒక పేపరూ, ఒక్కప్రశ్న తప్ప ఇవ్వాళ రెండో పేపరూ బాగా వ్రాసినావుగదా. మార్కులన్నీ కలుపుతారు. నీవు ప్యాసుకాకపోవు గాని వృథాగా అధైర్యపడవద్దు!” అన్నాను. కాని నామాట లతనికి ఎంత ధైర్యము కలిగించినవో ఎరగను.

మర్నాడు తెలుగు కాంపోజిషను! ఆరోజు కూడా వెనకటిరోజు ప్రశ్న చెడగొట్టినదాని సంగతి మాట్లాడుతూనే ఉన్నాడు.

ఆ మర్నాడు లెక్కలు! అతను పరీక్షకు వెళ్లుతూఉంటే “అధైర్యపడకుండా వ్రాయి! డిస్టింక్షను మరవవద్దు!” అన్నాను.

“ఏమో, మొదటిలెక్క బాగా వస్తే మిగిలిన వన్నీ బాగానే చేస్తాను!” అన్నాడు.

ఆసాయంత్రము అతను డీలాపోయి వచ్చినాడు. “ఇవ్వాళ బొటాబొటీగా మార్కులు వస్తవేమో! పొద్దున పేపరంతా చెడగొట్టినాను” అన్నాడు.

“సాయంత్రం పేపరో?”

“సాయంత్రం పేపరు బాగానే వ్రాశాను. రెండూ కలిపితే ప్యాసుమార్కులు రావచ్చునేమో!”

“సరే, ఐపోయిన దైపోయినది. రేపటికి జాగ్రత్తగా చదువు, ఫిజిక్సుగదా!” అన్నాను.

“ఎందుకండీ ఇంకా చదవడము!”

“తప్పతావని నిశ్చయం లేదుగా లెక్కల్లో! మిగిలినవి చదవవద్దూ?”

“తప్పతానని నిశ్చయ ముండవలెనా ఏమిటి?”

“ఇట్లా అసందర్భంగా మాట్లాడుతున్నావు, నీకు పిచ్చా ఏమిటి?” అని ఎన్నోవిధాల నవ్వించీ, ఆడించీ ధైర్యంచెప్పి చదువుకు కూచోబెట్టినాను. కాని ఇన్నాళ్లబట్టీ చదివిన బడలికకు నిలవలేక దీపము ముందు కూర్చున్నవాడు కూర్చున్నట్లే కొస్తసేపులో నిద్ర పోయినాడు. ఒళ్లు కొంచెము వెచ్చగా ఉన్నది.

మర్నాడే ఫిజిక్సు! అందులోనే అతనికి తప్పతానని ఏదో అధైర్యముగా ఉన్నది. కాని అంతకుణ్ణముగా మరేదీ చదవలేదు. హాస్యాద్భుతములు అందులోనే ఉంటవి.

అత నారోజు అధైర్యపడతా డని, పరీక్షకు వెళ్లేటప్పుడు నేను దగ్గర ఉండి ఫౌంటెనుకలము లందించి చేతితో చేయి పట్టుకొని ఆదరము చూపి పంపవలె నని నిశ్చయించుకున్నాను. పురాణకాలంలో యుద్ధానికి వెళ్లేవాళ్లకు ఆప్తులైనవాళ్లు ధనుర్బాణములూ, ఖడ్గాద్యాయుధములూ అందిచ్చేవాళ్లు. యుద్ధములో ఆయుధములకంటె పరీక్షలో కలము లెక్కువ అవసరము.

కాని నే ననుకున్నట్లు జరగలేదు. పొద్దున నేను కాఫీకి వెళ్లివస్తూఉండగా దోవలో ఒకానొక ప్రసిద్ధ కవి నా కెదురైనాడు. వారిని కుశలప్రశ్నము చేసి దాటిపోదా మనుకున్నాను గాని, వారు నాతో ఎక్కువ ఆదరముతో మాట్లాడుతూ తమ ఇంటికి నన్ను తీసుకొని వెళ్లి, తా మామధ్య వ్రాస్తున్న పుస్తకాలసంగతి ప్రశంసించసాగినారు. వారిమీద నున్న గౌరవాతిశయంచేత నేను తొందరపని ఉన్న దనలేకపోయినాను. వారైనా నా పరధ్యానమూ, అశాంతీ గమనించలేదు. కవులు తమ కావ్యాల సంగతి మాట్లాడేటప్పుడు విశ్వము మరుస్తారని జగద్విదితమే గదా! నేను నా గదికి తిరిగి వెళ్లేటప్పటికి పది ఐంది. ఇక చంద్రు డేంకనపడతాడు? నాకు అటెండెన్సు చాలా తక్కువ ఉండడంవల్ల స్నానభోజనాదులు లేకుండానే కాలేజీకి వెళ్లి, నా అటెండెన్సు చెప్ప మని ఇతరులకు అప్పగించి వచ్చినాను.

మధ్యాహ్నమైనా వెళ్లి అతన్ని కలుసుకోవలె ననిపించింది. కాని హాస్యాస్పదంగా ఉంటుందని ఊరకున్నాను. సాయంత్రముదాకా ఓపిక పట్టి ఉండ నిశ్చయించినాను.

ఆరోజు సాయంత్రము నేను చూచినప్పటి చంద్రుని ముఖము నా కీ జీవితములో ఎన్నటికీ మరుపుకు రాదు. తేనె లొలికే అతని ముఖంలో అంతదైన్యము మూర్తీభవించి ఎదట కనబడితే అది భరించడ మెట్లాగు! అబ్బా! పరీక్ష ఎంత అల్పమైనది! ఆ అల్పమైన పరీక్షకు అమూల్యమైన అతని వికాసమును గ్రసించే శక్తి వచ్చింది గదా! ఈ పరీక్షాపిశాచచేష్టలవల్ల ఎందరెందరి దివ్యబుద్ధులు క్షీణించిపోతున్నవో ప్రతిసంవత్సరమూ!

చంద్రుడు రాగానే ఏమీ మాట్లాడక, పోయి చాపమీద బోర్లబుక్కలా పండుకున్నాడు. నేను నవ్వు తెచ్చుకొని మాట్లాడుదా మని ప్రయత్నించినా నాకది రాలేదు. కొంతసే పయినతర్వాత నే నతని పక్కకుపోయి కూర్చుని, నెమ్మదిగా వీపు చరిచి, అతని శిరస్సు నాతొడమీద ఉంచుకున్నాను. అతనిదేహ మేమీ చెమటపోసినట్లు లేదు కాని నాకాలు తడుస్తున్నట్లు నాకు తోచింది. కాని అప్పుడు చంద్రుడు కన్నీళ్లు విడుస్తున్నా డనుకోను. అత నెప్పుడూ కన్నీళ్లు విడవడు. అతని దుఃఖము నతను దిగమింగవలసినదే కాని పొంగనీయడు. నా ఎదట నైనప్పటికీ కన్నీళ్లు విడవడానికతని అభిమాన మొప్పుకోదు. ఆరోగ్య మున్నవాళ్లే తమ కష్టసుఖాలు రెండూ సమంగా వెలిబుచ్చ సాహసిస్తారు. అందువల్లనే చంద్రుడు నాకళ్ల నీళ్లు ఒకటి రెండుసార్లు చూచినాడు కాని నేను అతని కన్నీళ్లెన్నడూ చూడలేదు.

ఆరోజున ఇక నెంత చెప్పినా అతడు మర్నాటి పరీక్షకేమీ చదవలేదు. "ఎందుకండీ, నిన్నటి పరీక్షలో ప్యాసవుతాను కాని ఇవ్వాళ పేపరులో నన్ను ప్యాసు చేయడము ఎవ్వరికీ సాధ్యము కాదు" అన్నాడు.

"నీకు అధైర్యపడడ మభ్యాసమేగా!" అన్నాను.

"మీకు పిచ్చా ఏమిటి? రెండుప్రశ్నలుమాత్రమే వ్రాస్తే ఎవడు ప్యాసు చేస్తా డండీ? మీకే పేపరిస్తే ప్యాసుమార్కులు వేస్తారా?" అని బిగ్గరగా అడిగినాడు.

నే నేమీ తొందరపడక శాంతముగా "రెండు ప్రశ్నలే వ్రాయడమేం? పేపర్లు రెండూ అంత కష్టంగా ఉన్నవా?" అన్నాను.

"అంత చులకన పేప ర్లెప్పుడూ ఉండవు. అందరూ పూర్తిగా వ్రాసి వచ్చారు. ఇప్పుడు మళ్లీ ఆ పేపర్లే ఇస్తే అరవైమార్కులు తెచ్చుకోలేనూ?"

"ఐతే నీ తెలివితక్కువ నా కేమీ అర్థం కావడం లేదు!" అన్నాను.

తన ముఖం వేలితో చూపి, చంద్రుడు, దీనంగా "అది!" అన్నాడు.

ఆరోజు పొద్దున పేపరు చూచినాడుట. చులకనగా ఉన్న దిగడా పూర్తిగా వ్రాద్దామని మొదలు పెట్టినాడు. కాని వ్రాయబోతే మనస్సు నిరామయ మయిందట. ఏంజేస్తాడు! సాయంత్రమూ అంతే అయింది. రెండు పేపర్లూ ఇట్లాగే చెడగొట్టినాడు.

అన్నాళ్లకు అన్నిసార్లు అనుభవమైనతర్వాత ఆరోజున మొదటిసారి అతని అధైర్యముతో నేను ఏకీభవించినాను. ఆ పేపరులో ప్యాసుకావడము కష్టమని నాకూ తోచింది. ఆరోజు పరీక్షలో తప్పితే మిగిలిన పరీక్షలలో ఎన్ని మార్కులు వచ్చినా లాభం లేదు. ఐనా జూదంలో ఎత్తువలె మర్నాటి పరీక్షకు కూడా బాగా చదివి కూర్చుని రమ్మన్నాను. ఆపరీక్షకు కూర్చొనేట్లు ఒప్పించడమే నాకు కష్టమయింది. ఆ పరీక్షకు అతనేమీ చదవలేదు.

అది కెమిస్ట్రీపరీక్ష. అదే చివరరోజు! దానికి ఎక్కువ వల్లెవేయవలె. అందువల్ల మును పెంత చదివి ఉన్నా ఆపరీక్షముందు అంతా ఒకసారి జ్ఞాపకంచేసుకోకపోతే లాభం లేదు. ఆరోజు రాత్రల్లా నిద్రపోకుండా కూర్చుంటూ నంటూఉండేవాడు చంద్రుడు. కాని పుస్తకమన్నా ముట్టుకోలేదు.

ఆరోజు పొద్దున నేను నవ్వు తెచ్చుకొని "నీవివ్వాళ బాగా వ్రాస్తావని ఏమో చెప్పతున్నది నాకు!" అన్నాను.

"మీ కెట్లా తెలుసు? దేన్నిబట్టి చెప్పతున్నారు?" అన్నాడు.

"నాకుమాత్ర మేం తెలుసు? అట్లా అనబుద్ధివేసి అన్నాను!" అన్నాను.

"ఇవ్వాళా, నిన్నా చదవకపోయినా బాగానే వ్రాయవచ్చు! ఐనా ఏంలాభం?" అన్నాడు.

ఆరోజతను బండిలో ఎక్కేదాకా నేను వెంటనే ఉన్నాను. బండి సాగిపోతూఉంటే అతను నావైపు చూచి మనోహరంగా నవ్వినాడు. అప్రయత్నంగా నాకూ చిరునవ్వు వచ్చింది. మానవ్వుల అర్థ మేమిటూ అని పరధ్యానంగా ఆలోచించుకుంటూ గదికి వెళ్లి పోయినాను. అట్లా వెళ్లుతున్నప్పుడు నాకు తెలియకుండా నవ్వుతూఉన్నా ననుకుంటాను. అప్పుడు నన్ను వీధుల బోయేవాళ్లు చూచి ఏ మనుకున్నారో!

పొద్దున నేను ప్రశ్న చెప్పినట్లుగానే ఆరోజు చంద్రుడు పేపరు చాలాబాగా వ్రాసినాడు. అతనే యాభైమార్కులకు తక్కువ రావనీ, అరవై కూడా రావచ్చుననీ చెప్పినాడు. అది విన్నప్పుడు నాకు చదువులూ, పరీక్షలూ, ఫలితాలూ ఇట్లా ఉంటవికదా అని చింతతో కూడిన నవ్వు వచ్చింది.

పరీక్షలు కాగానే అందరికీ పెద్దభారము వదలినట్లు తోస్తుంది. కాని చంద్రుడి కాసుఖ మేమాత్రమూ లేకపోయింది. అతను తప్పతాననే నిశ్చయంతో, తప్పినవార్త విన్నప్పటివలెనే బాధపడ్డాడు. నాలుగైదు రోజులు పట్నంలోనే పిచ్చివానివలె తిరిగినాడు.

అక్కడ అన్నాళ్లు ఉన్నందువల్ల కొంత లాభం కలిగింది. వాళ్ల ఫిజిక్సు పేపర్లు దిద్దే పెద్దమనిషి చాలాసార్లు పరీక్షలు తప్పినవాడు కావడంచేత చాలాబాగా మార్కులు వేస్తాడని తెలిసింది. "ఐనా నే నేమన్నా వ్రాస్తే కాదండీ!" అన్నాడు చంద్రుడు.

ఇట్లా ఉంటూఉండగా ఒకనాడు అకస్మాత్తుగా చంద్రునికి ఇంటిమీద ధ్యానం మళ్లి బయలుదేరినాడు. స్టేషనుకు వెళ్లి పంపించి వచ్చినాను. రైలు కదలగానే నా కేదో బరువుతీరినట్లు తోచింది. అటువంటి భావము నాకు రావడము మంచిదో, చెడ్డదో!

అతను వెళ్లిన కొద్దిరోజులకు అతని బంధువుతో — విక్టోరియా హాస్టలువంటి ఇల్లు కట్టమన్న బంధువే — అతను ఫిజిక్సు పేపరు చెడగొట్టిన విచిత్ర కథ నేను చెప్పతూ ఉంటే, ఆబంధువు "మీకు తెలియదు లెండి! అత నట్లాగే చెప్పతాడు గాని తెలిసిన ప్రశ్నలు ఎందుకు వ్రాయలేదు? అతని కసలు లెక్కలు బాగారావు. ఫిజిక్సులో లెక్కల ప్రమేయమున్నది కాబట్టి అది చెడగొట్టినాడు లెండి! అతని కబుర్లు మీరు కాబట్టి నమ్మినారు!" అన్నాడు. ఆయనను ఒప్పించడానికి ప్రయత్నించి ప్రయోజనం లేదని నేను "ఔను కాబోలు, నేను పూర్తిగా మోసపోయినాను సుమా!" అన్నాను.

చంద్రుడు పట్నం విడిచి వెళ్లినతర్వాత నాకు చదువు తీవ్రంగా సాగింది. నాకు చంద్రుడు తరుచుగానే ఉత్తరాలు వ్రాసినాడు. తాను పరీక్షకోసము దిగులుపడకుండా ఉంటూ ఉన్నట్లు వ్రాస్తూ వచ్చినాడు. కాని నన్ను సంతోషపెట్టడానికి అబద్ధము వ్రాస్తున్నట్లు వాటిల్లోనే నాకు స్పష్టపడేది. ఒకరి నొకరము బాగా తెలుసుకున్నతర్వాత ఎంత దాచవలె నని ప్రయత్నం చేసినా మన భావాలు ఒండొరులము తెలుసుకోకుండా దాచలేము. "పిచ్చి చంద్రశేఖరం!" అని మనస్సులో అనుకొని నవ్వుకునేవాణ్ణి. అతని స్థితిలో అతను అప్పుడప్పుడు నాకు ధైర్యం చెప్పవలె నని కూడా ఉత్తరం వ్రాసేవాడు.

"మీ కథ లంతా పొగడుతున్నారు. మీ పేరు దేశంలో మోగిపోయేరోజులు రాకపోవు! బాగా చదవండి! నా మెదడు కూడా మీ మెదడుతో కలిసి మరింత బాగా పనిచేయడానికి పంపుతున్నాను" అని ఉన్నది ఒక ఉత్తరంలో.

దానికి నేను వ్రాసిన జవాబు కాస్త చమత్కారంగా ఉంటుంది. "చంద్రా, నీవు నీ మెదడు నాకు పంపినందుకు నీకనేక వందనములు. కాని నీది పోకుండా మాత్రము చూసుకో!" — కాని ఇందులో చమత్కారము ఇంగ్లీషుభాషలో పెట్టినప్పుడు మరీ చక్కగా ఉంటుంది. ఆ ఉత్తరాలు రెండూ ఇంగ్లీషులోనే వ్రాసుకున్నాము.

## ౧౦

నిన్నరాత్రి మా స్నేహితుని ఇంట్లో కలిసినప్పుడు జరిగిన సంభాషణసంగతి కొంచెము చెప్పవలసి ఉన్నది. ఆ స్నేహితునికి తా నన్నది బ్రహ్మవాక్యమల్లే ఔతుం దని ఒక నమ్మక మున్నది. మంచి ఏమో కాని చెడుమాత్రము అత నన్నట్లే రెండుమూడుసార్లు సిద్ధించింది. ఏది ఎట్లా ఉన్నా అత నది గర్వంగా చెప్పుకుంటాడు. వాళ్ల ఇంటి ఎదటనే బావి ఒకటి తవ్వుతున్నారు. "చూశారా, నేను ఈసంధ్య అట్లా వెళ్లుతూ ఆతవ్వుతున్న బావివంక తీక్ష్ణంగా చూశాను. ఎంత లోతుకు తవ్వినా ఇప్పటి కింకా నీళ్లు పడలేదు. ఒకవేళ నీళ్లు పడితేమాత్రము తాగేందుకు పనికివస్తవనా?" అన్నాడు.

అది విని చంద్రుడు "మీమాట నిజమవుతుందో కాదో చూతాము. నేను పరీక్ష ప్యాసవుతానో కానో చెప్పండి" అన్నాడు.

ఆ స్నేహితుడు "నీవా, ఇంగ్లీషులో ప్యాసవుతావు. ఆప్షనల్సులో తప్పుతావు, చూసుకో!" అని నిశ్శంకముగా అన్నాడు. చంద్రుడు చిన్నబుచ్చుకున్నాడు

తర్వాత నేను నవ్వుతూ "నేను ప్యాసవుతానో కానో చెప్పండి!" అన్నాను.

నే నాప్రశ్న అడుగుతా నని ఆయన అనుకోలేదు. మొదట శంకించి చివరకు "మీ సంగతి చెప్పడము నా కిష్టము లేదు" అన్నాడు. నాకు అప్రియము చెప్పడానికి జంకినా డని నన్ను నేను పొగడుకొని సంతోషించినాను.

ఇంతవరకూ తెలిపినతర్వాత చంద్రుని పరీక్షాఫలితము ఏమని వచ్చినదో వేరే చెప్పవలసిన పనిలేదు. మా ఇంటివద్ద అతనన్నట్లు అతన్ని నేను చాలామారము పంపవలసివచ్చింది. నేనన్న "అవసరమైతే ఇంటిదాకా కూడా పంపుతాను" లోని 'అవసరము' వచ్చింది.

దోవలో, పాపము! అతను ఒకటే తీరాన పరీక్షసంగతి మాట్లాడసాగినాడు. "ఆసంగతి విడిచిపెట్టి ఇంకోటి మాట్లాడు, పోనీ!" అన్నాను.

"నాకది చేతకాదు. పోనీ, ఇంగ్లీషులో తప్పి ఆప్షనల్సులో ప్యాసయితే సంతోషించేవాణ్ణి. ఇంగ్లీషైతే ఇప్పుడున్నవాణ్ణి ఉన్నట్లు పోయి పరీక్షకు కూర్చొని ప్యాసుకాగలనని ధైర్యమున్నది. అంతా ఇంగ్లీషులో ఎందుకు తప్పుతారో తెలియదు. ఇంగ్లీషు నేనస లేమీ చదవలేదు. మీరు చూస్తూనే ఉన్నారుగా!—" ఈ విధంగా ప్రవాహము పోతున్నది.

వాళ్ల అమ్మగారు ఈమధ్యనే ఒకనాడు "మనకివి మంచిరోజులు కావు నాయనా!" అన్నారుట. కొద్దిరోజుల కిందటనే వాళ్లకు కొన్నివేలరూపాయల

సొమ్ము అప్పుతీసుకున్న వర్తకుడు దివాలాకావడం వల్ల పోయింది. దానికితోడు సెలవుల్లో పెళ్లికి వెళ్లినప్పుడు ఆ మెడవడ్డాణము పోయినది. చంద్రుని చిన్నతమ్ముడు ఆ సంవత్సరమే ఫోర్తుఫారము తప్పినాడు. కష్టాలన్నీ కలిసి కాని రావనే జనవాక్యము అప్పుడప్పుడు నిజ మవుతూనే ఉంటుంది.

ఒకచోట రెండు కంచెలమధ్యనున్న సన్నదారి గుండా పోవలెను. నేను జాగ్రత్తగా కింద చూసి నడుస్తున్నాను. చంద్రుడు మాట్లాడుతూ పరధ్యానంగా నడుస్తూ ఉంటే ముళ్లుగుచ్చుకుంట వేమోనని,తల ఎత్తి, "అదేమిటి?" అన్నాను. చంద్రుడు ముఖ మవతలికి తిప్పి "ఏమీ లేదండీ, గాలిదుమ్ము కళ్లలోపడి నీటిబొట్టు కారిన దింతేనండీ!" అన్నాడు. ధీరోదాత్తులు అంతస్తంభితబాష్పులు కారూ! అదిగాక చంద్రుడు పరీక్ష తప్పినందుకు కన్నీటి బొట్టు విడిచినా డనుకోను.

వాళ్ల ఇంటిదాకా చంద్రుణ్ణి పంపినాను. 'విష ప్రయోగము' కథ కాగితాలు అతని చేతులోనుంచి తీసుకోవడము నేను మరిచిపోలేను. "చింపనులెండి" అని చంద్రుడు చెప్పుతున్నా, మంచి దని తీసుకున్నాను.

చివరకు అతన్ని ఇంటివద్ద విడిచి "సాయంత్రం తప్పక కలుసుకో! నీకోసము ఆదుర్దాగా ఎదురు చూస్తూ ఉంటాను"అని వెనక్కు తిరిగినాను. అప్పుడు, కౌముదిచెప్పిన మా గురువుగారిని ఇంటివద్ద సంధ్యావందనం చేసుకుంటూ ఉండగా విడిచివచ్చినది జ్ఞాపకానికి వచ్చింది.వెంటనే వాయువేగంతో వచ్చి ఇల్లుచేరినాను.

ఇంటివద్ద మా ఉపాధ్యాయులు లేరు. సంధ్యావందన మయ్యేటప్పటికి నేనక్కడ లేకపోవడముచూచి, కొంతసేపు నిరీక్షించి, ఎంతసేపటికీ రాలేదని కోపంతో వెళ్లిపోయి ఉంటారు. ఇవ్వాళ సాయంత్రము ఆయన దగ్గరకు వెళ్లి క్షమాపణము కోరుకోవలె!

౧౧

కాని కథ ఇంకా పూర్తికాలేదు. సామాన్యంగా ఎవరికథ వాళ్లు చెప్పుకోవడమంటేనూ, దాన్ని ఇతరులు మెచ్చుకుంటున్నా రంటేనూ అందరికీ సరదా. కాని నాకు చంద్రునికథ చెప్పడమంటేనూ, అది విని ఇతరులు ఆనందిస్తేనూ సంతోషము కలుగుతుంది. కాని ఇంతవరకూ చంద్రునికథ చెప్పినతర్వాత కాస్త నాకథ కూడా చెప్పుకోకపోతే మనశ్శాంతి కలగదు.

పెద్దపరీక్ష లన్నీ ఒక్కొక్క దండయాత్ర ఐనా చేసిన ఆరోగ్యవంతుణ్ణే ఐనా చిన్నపరీక్షలు సక్రమంగా దాటుతూ ఉండడమువల్లనూ, పసితనంలోనే చదువు ప్రారంభించడమువల్లనూ నేను చిన్న ఈడుకే బి. ఏ. ప్యాసయినాను. చిన్నప్పటినుంచీ నాకు ప్లీడర్లంటే అసహ్యమూ, ఉపాధ్యాయవృత్తి అంటే ఇష్టమూ ఉండేది. నా అదృష్టంవల్ల, కష్టపడి ప్రయత్నించకుండానే, మా ఊళ్లో నన్ను పిలిపించి ఉపాధ్యాయోద్యోగము ఇచ్చినారు. మూడేళ్లక్కడ పని చేసినతర్వాత నన్ను యల్. టి. కి వెళ్లమన్నారు. అట్లాగే వెళ్లుదామనుకుంటూ ఉండగానే పోయిన జూనునెలలో ఒక సాయంకాలము షికారు వెళ్లి వచ్చి, అకస్మాత్తుగా, నేను లాకాలేజీకి వెళ్లుతున్నానని ఇంట్లో చెప్పినాను. గంటసేపటిలో నాజీవితపు భావిచిత్ర మంతా మారిపోయింది. చిన్నప్పటినుంచీ అనుదినాభివృద్ధి చెందిన వకీళ్లమీది వైరము గౌరవాకారము తాల్చింది. కాని నే నేమీ తొందరపని చేశా ననుకోను. నా జీవితంలో ఇంత తెలివిగల పని ఇంకొకటి చేసినట్లు నాకు జ్ఞప్తి లేదు.

ఇంట్లో అందరితోనూ చెప్పినాను గాని నా నూతననిశ్చయము మా నాన్నగారితో మాత్రము చెప్పలేదు. వారు పెద్దవారు. నాకై నిర్మించుకున్న భవిష్యత్సౌధాన్ని వారు నావలె గంటలో నిర్మూలించలేరు. అందులో ప్లీడర్లంతా అబద్ధాలఖోరులనీ, ఆ వృత్తే అన్యాయవృత్తి అనీ వారి ఉద్దేశము. ఏదో కృష్ణా రామా అనుకుంటూ ఉండేవాళ్లు తమ కొడుకు అటువంటి వృత్తిలో ప్రవేశించబోతున్నా డంటే ఇష్టపడతారా? ఇంట్లో పెత్తనము నాదే కాబట్టి మా నాన్నగారికి ముందుగా చెప్పి ఒప్పించవలసిన అవసరముకూడా లేకపోయింది. చెన్నపట్టణంప్రయాణానికి సన్నాహమైన రోజుననే నేను వారికీసంగతి తెలియజేసినాను. అప్పటికే

ఇతరులవల్ల విన్న మా నాన్నగారికి ఈవార్త ఆశ్చర్యము కలిగించలేదు. మొదట ఏదో సలహా ఇయ్యబోయినారు కాని మళ్లీ నాప్రయాణసన్నాహమంతా చూసి ఊరుకున్నారు. ఇంతా చేస్తే ఆరోజు నా ప్రయాణము సాగనే లేదు. అంతా నెమ్మదిగా చెప్పుతాను.

నేను లా కాలేజీలో సీటుకు దరఖాస్తుఫారము కోసము ఉత్తరము వ్రాసినప్పటినుంచీ నేటిదాకా దుశ్శకునపరంపర నన్ను వెంట నంటింది. ఆ ఉత్తరము వ్రాసి పోస్టులో వేయబోతూ, ఆడించుకుంటూ వెళ్లినాను. దోవలో అది రెండుసార్లు కిందపడి మూడోసారికాని పోస్టుపెట్టెలో పడలేదు.

ఆ అనుమానానికి దాఖలాగానే నాకు దరఖాస్తుఫారము రాలేదు. అందరికీ వచ్చినవి. ఎన్నాళ్లు ఎదురుచూసినా నాకు రాలేదు. సీట్లేవో మించి పోతవని మా ఊళ్లో పుకారు పుట్టడమువల్ల యూనివర్సిటీ క్యాలెండరు వెదకి, దానిలో ఉన్నట్లు దరఖాస్తుఫారమొకటి టైపు చేయించినాను. తీరా టైపిస్టు అది టైపుచేసి పెట్టెలోనుంచి లాగేటప్పుడు ఆకాగితం కాస్తా చినిగి పనికిరాకుండా పోయింది. ఆ టైపిస్టు పాపము, చాలా నొచ్చుకొని "పోనీ, సాయంత్రం రండి!" అన్నాడు.

ఆయన అన్నట్లు సాయంత్రమాయనకోసము వెళ్లితే ఆయన అక్కడ కనపడలేదు.

మర్నాడు ఇంకో టైపిస్టువద్దకు వెళ్లి జాగ్రత్తగా టైపుచేయించి పూర్తిచేసి ఉత్తరము పోస్టులో వేసేటప్పుడు ఆడించకుండా తీసుకొని వెళ్లినాను.

చెన్నపట్టణంప్రయాణం పెట్టుకుంటే మూడోసారి కాని సాగలేదు. రెండుసార్లూ ఏ స్నేహితుని కోసమో ఆగవలసివచ్చేది. మొదటిసారి భోజనం చేసి బండీ పిలవబోతున్నప్పుడు ప్రయాణము ఆపుదల చేయవలసివచ్చింది. రెండోసారి బండీ వాకిట్లో వచ్చి నిలిచినతర్వాత ఆగిపోయింది. అందువల్ల నా స్నేహితుల కందరికీ నా చెన్నపట్టణప్రయాణ మంటే నవ్వులాటకింద పడ్డది. ఆఖరుకు నేను రైలులో ఎక్కి కూర్చుంటే వాళ్లచూపును వాళ్లు నమ్మలేకపోయినారు.

ఇన్నిసార్లు ప్రయాణాలై నేను పట్నంవెళ్లేటప్పటికి కాలేజీ తెరిచి పదిరోజులైంది. వెళ్లినరోజు మంచిదని ఆరోజే జీతం కట్టుదామంటే బ్యాంకు మూసినతర్వాత నేను అక్కడ చేరుకున్నాను. మర్నాడు జీతంకట్టి వచ్చేటప్పటికి స్కూలు మూసివేశారు. ఆ మర్నాడు మంచిరోజు కాకపోయినా రోజులు వృథాగా పోతున్నవని పోయి క్లాసులో కూర్చున్నాను. నేను అట్లా పోయి కూర్చున్న మొదటిగంటలో మా లెక్చరరు అటెండెన్సు తీసుకున్నప్పుడు నా పేరెప్పుడు పిలిచినాడో నాకు వినపడక నేను అప్పుడు అటెండెన్సు చెప్పలేదు. ఆ గంట ఐపోయినతర్వాత ప్రత్యేకముగా ఆయనవద్దకు వెళ్లి అటెండెన్సు వేయించుకున్నాను. మొదటిరోజిట్లా ఐనదనుకుంటే రెండవరోజు అసలు కాలేజీకే సెలవువచ్చి నాకు ద్వితీయవిఘ్నమయింది.

ఆరోజు కాలేజీకి సెలవు అని నేను డాక్టరుస్నేహితుణ్ణి ఒకణ్ణి చూడబోయినాను. అప్పుడు, త్వరగా పోతున్న ట్రాములోనుంచి కిందికి దూకబోయి కింద నిలువునా బోర్లబుక్కలా పడ్డాను. కుడిచేయి గూడు తొలిగింది. ఇప్పటికీ అది అవుడే. వెంటనే నాడాక్టరు స్నేహితుడు ఎముక పాటునవేసి కట్టుకట్టినాడు. అత్యల్పముగానే తొలగడమువల్ల వారమురోజులు కట్టు ఉంచమని స్నేహితుడు చెప్పినా వినక, మర్నాడు పొద్దునే, పోరి, ఆస్నేహితునిచేతనే కట్టు విప్పించుకున్నాను.

ఇన్ని దుశ్శకునాలు ఒకటివెంటఒకటి సంభవిస్తే ఎంత ఆరోగ్యవంతుణ్ణి ఐనా నాకూ కాస్త జంకుపుట్టించినవని ఒప్పుకుంటే నా ధైర్యసాహసాదులకు లోపముండ దనుకుంటాను. ఏమోటారుకింద పడిపోతానో అని నేను బహుజాగ్రత్తగా నడిచేవాణ్ణి. అదృష్టంవల్ల ఇప్పటికి నే నేమోటారుకిందా పడలేదు.

క్రిస్టమసు సెలవులకు ముందు నాకు జ్వరం వచ్చింది కాని మా ఊరురాగానే నయమయింది. ఈ జ్వరంవల్ల చాలారోజులు పోవడమూ, మొదట కాలేజీలో చేరడమే ఆలస్యము కావడమూ, అప్పు

డప్పుడు ఇతరులను అటెండెన్సు చెప్పమని షికార్లు కొట్టితే వాళ్లు భయపడి చెప్పకపోవడమూ — ఇవన్నీ కలిసి నా అటెండెన్సును చాలావరకు మింగివేసినవి. మొదటి టర్ము అయ్యేటప్పటికి ముప్పయిరోజు లై పోయినవి. రెండవ టర్ములో మూడురోజులు ఆలస్య ముగా వచ్చినాను. ఇక ఐదురోజులు మాత్రము ఆబ్సెంటు కావచ్చును. ఆ ఐదురోజులూకూడా నెమ్మది నెమ్మదిగా తరగజొచ్చినవి. గుండెలు దడదడ లాడసాగి నవి. అటెండెన్సు చాలక పరీక్షకు పోకపోతే సిగ్గుచాటు. అంతగా అటెండెన్సు చాలకపోతే ఉపాయ మేమిటీ అని ఆలోచిస్తున్నాను. ప్రిన్సిపాలువద్దకు పోయి "నన్ను రైటర్లు పొరపాటున అన్యాయము చేసినారు. నే నెప్పుడూ ఆబ్సెంటు కానిదే ఇన్ని ఆబ్సెంట్లు పడ్డ" వని నిశ్చలంగా వెళ్లి అబద్ధ మాడవలసివస్తుం దేమో, అబద్ధమాడినా లాభిస్తుందో లేదో అని భయం వేయసాగింది. కాని ఆ అవసర మేమీ లేకుండా బొటా బొటీగా నాకు అటెండెన్సు సరిపోయింది. ఇంకో రోజు వెళ్లకపోతే నన్ను పరీక్షకు పోనిచ్చేవాళ్లు కారు.

పరీక్షలు ఇరవైరోజులలోకి వచ్చినవి. ఇన్ని దుశ్శకునాలూ ఫలం లేకుండా ఊరికే ఎట్లాపోతవా అని దిగులుపుట్టింది. ఇక పరీక్ష ఏమవుతుందో అని అప్పుడు అనుమానం ప్రారంభించింది.

అనుమానం ప్రారంభించినకొద్దీ దానికి అను గుణమైన విషయాలన్నీ మనస్సుకు తట్టసాగినవి. ఇంటరు మీడియేటు నాతోప్యాసయిన నా పేరింటి పెద్దమనిషి ఒకతను ఈసంవత్సరము త్రివేంద్రములో బి. యల్. చదువుతున్నాడు. సెప్టెంబరు పరీక్షలో యఫ్. యల్. పూర్తికాగానే తనవద్దనున్న ఒకటిరెండు పుస్తకాలూ నాకిచ్చినాడు. నేను యఫ్. యల్. పుస్తకాలు వేరే కొనలేదు. ఉన్న ఒకటిరెండు పుస్తకాలూ చదివిన వాడు త్రివేంద్రములో బి. యల్. క్లాసులో చేరి సెప్టెంబరులో యఫ్. యల్. పరీక్ష ప్యాసయినాడు.

ఈ విధంగా నేను భయపడుతున్న ఆరోజుల్లో నే మానాన్నగారివద్దనుంచి ఉత్తరం వచ్చింది. "నీవు వెనక పనిచేసిన స్కూలువాళ్లు వీలైతే నిన్ను మళ్లీ తీసుకుందా మనుకుంటున్నారు. నన్ను వాళ్లడగగా 'ఈసంవత్సరం మావాడు ప్యాసయితే పైక్లాసు చది విస్తాను. లేకపోతే మీస్కూల్లో చేర్పిస్తా'నని జవాబు చెప్పినాను" అనే వాక్యాలుకూడా ఆ ఉత్తరంలో ఉన్నవి. మా నాన్నగారు నేను తప్పవలె నని కోరు కుంటున్నారా అనే ఊహ నాకు రాక తప్పిందికాదు. నేను కథలు వ్రాసుకుంటూ ఉంటా నని మానాన్న గారికి తెలుసు కాబట్టి వారి కాకోరిక ఉంటే అది సిద్ధిస్తుందనే ఆశకూడా బలంగా ఉండిఉంటుంది, తప్పదు. చంద్రుని నాన్నగారు అతను తప్పతాడేమో అని భయపడుతూ ఉంటే, మానాన్నగారు నే నీసంవ త్సరము ప్యాసవుతానేమో అని భయపడుతున్నారు. రెంటిలో ఏదైనా ఒకటే, తప్పడానికి సహాయం చేయ డానికి! అందులో, చంద్రుడు బాగా చదివినా, ఇతర కారణాలు ఒకదాని కొకటి కూడి అతన్ని తప్పేట్లు చేసేట్లున్నవని నాకు తెలుసును. ఇన్ని దుశ్శకునాలూ, మా తండ్రిగారి కోరికా అన్నీ నన్ను తప్పించవలెననే ప్రయత్నాలు చేస్తున్నవి. చంద్రుని సహవాసమువల్ల నాలో వెనకటి నిర్భయము కొత్త సల్లిచ్చినట్లున్నది. అదిగాక చంద్రుడు వాళ్ల పుస్తకాలు చదివినట్లు నేను మా పుస్తకాలు చదవలేదు. మర్యాదగా పేపర్లిస్తే తప్పక ప్యాసు కాగలను, లేకపోతే ఎవరికి తెలుసు! ఇక మా నాన్నగారి ఉత్తరం నన్ను కలత పెట్టసాగింది. మెరుపు మెరిసినట్లు మొదటినుంచీ కనబడుతున్న దుశ్శ కునాలు తలపుకు వస్తవి. వ్యర్థపు భయాలు చంద్రుని చేత ఫిజిక్సు పేపరు చెడగొట్టించినట్లే నన్ను కూడా చేస్తవేమో అని భయం వేయసాగింది. మూడేళ్లు టీచరుపని చేసి పెద్దక్లాసులకు పాఠాలు చెప్పి, యఫ్. యల్. క్లాసు తప్పినా డంటే నామర్దా అనిపించింది. ఇన్నాళ్లకు, చంద్రశేఖరంతో సా · సంవల్ల పరీక్ష తప్పతా మంటే భయమూ, తప్పినామంటే సిగ్గూ ఏమిటో నాకు తెలిసింది.

నేను భయపడుతున్నట్లుగానే చివర పేపరు వ్రాయడంలో ఒక విచిత్రం జరిగింది. ప్రశ్నలు చూచి నాను. వాటిలో ఒకటి రెండు తప్ప నాకేమీ తెలిసి నట్లు తోచలేదు. నా ఎదటనున్న ఆ తెల్లకాగితము

వలెనే ఐపోయింది నామనస్సు. ధైర్యం తెచ్చుకొని, తెలిసిన ఆ ఒకటిరెండు ప్రశ్నలూ జాగ్రత్తగా కాసేపులో వ్రాసేశాను. కావలసినంతవేళ మిగిలింది. ఏమీ తోచలేదు. అట్టె కడుపులోనుంచి ఆవేదన బయలుదేరి దేహమంతా తీవ్రముగా వ్యాపించింది. "ఈ పేపరు సున్నచుట్టితే ఇంకా ఏమున్నది!" అనుకున్నాను. సంవత్సరంనుంచి చదివిన చదువంతా వ్యర్థమయితే ఎంత కష్టమో నాకళ్లఎదుట కట్టినట్లయింది. ఇట్లా తోచిన కొద్దీ మనస్సు నిరామయం కాసాగింది. చంద్రుడు జ్ఞాపకం వచ్చినాడు. అతనుకూడా ఇట్లాగే ఫిజిక్సు పేపరురోజున కూర్చున్నాడు కాబోలు ననుకున్నాను. చంద్రుడు జ్ఞప్తికి రాగానే మరింత అధైర్యము కలిగింది.

కొంతసేపటికి నన్ను చూసి నేనే బలవంతాన నవ్వుతెచ్చుకొని నవ్వినాను. తోచిందల్లా వ్రాతామని కలమెత్తినాను. కలమెత్తుకుంటే రాయప్రోలు సుబ్బారావుగారి 'లేఖినీ శుభావాహన'తో మొదలుపెట్టి వెంకట పార్వతీశ్వరకవుల పద్యాలలోకి పోయి నెమ్మదినెమ్మదిగా లేఖినీప్రశంస లున్న మధ్యకవుల భట్రాజుచాటువులలోనికి మనస్సు పరుగెత్తింది. దానితో నేను మరింత నవ్వుకొని ప్రశ్నలకు జవాబులు ఆలోచించ మొదలుపెట్టినాను. ప్రశ్నల కన్నింటికి లీలగా ఉత్తరములు రా మొదలుపెట్టినవి. వ్రాయడం సాగించినాను. కలం సాగినకొద్దీ ఏమి టేమిటో వ్రాశాను. ఏంవ్రాశానో బాగా జ్ఞాపకం లేదు కాని కథలూ, పద్యాలూమాత్రము వ్రాయలే దని ధైర్యమే. పరీక్షహాలులోనుంచి బయటికి వచ్చి, వ్రాసినవాటిలో అప్పటికి జ్ఞాపకమున్న ఒకటిరెండు విషయాలూ సరిఐన వేమో చూదామని పుస్తకం చూసుకుంటే పూర్తిగా సరియైన వని తెలిసింది. కాని సవాలక్షవిషయాలలో ఒకటి రెండు సరి ఐతేమాత్ర మేమిలాభము ?

పేపరు వ్రాయడం పూర్తికాగానే నా తల సుత్తెలుపెట్టి కొట్టుతున్నట్లు నొప్పి పుట్టసాగింది. వెంటనే రెస్టోరెంటుకు వెళ్లి మంచుగడ్డతో చేసే పదార్థాలన్నీ తెప్పించి సాపడ్డాను. తలనొప్పి దానిదోవను అది పోయింది.

మాపరీక్షా ఫలితాలుకూడా పదిహేను రోజుల్లో తెలుస్తవి. కథలు వ్రాసేవాళ్ల మనస్సులు ఎట్లా పూర్తి ఐతే అందంగా ఉంటుందో అట్లా జరుగుతుందని తలస్తూ ఉంటవి. నేను తప్పితేనే ఈకథకు సరియైన అంత ముంటుంది. అదే జరిగేట్లుకూడా తోస్తున్నది. నిన్నరాత్రి, అన్నమాట అయ్యే స్నేహితుడు నాతో నా పరీక్షసంగతి ఏమీ చెప్పనని చెప్పినా, నేను మాఇంటికి వచ్చిన తర్వాత నా విషయము చంద్రుడడిగితే "ఆయన చెన్నపట్టణం వెళ్లేప్పుడు ఆయనమొహమే చెప్పింది ప్యాసుకాడని! అనుమానంలేదు" అన్నాడుట. ఆయన మాట తప్పేట్లు నేనే చేయవలెను! అందుకని ఐనా ప్యాసవుతే బాగుండు ననిపిస్తున్నది.

కాని ఇవ్వాళనే నా పరీక్షసంగతి తేలిం దని నా కేమిటో చెప్పుతున్నది. అది నాభయమూ కావచ్చు, అశరీరవాక్కూ కావచ్చు! చంద్రుడు తప్పినతర్వాత నేనుమాత్రము ప్యాసవుతానా! అతను సగము తప్పినా డని మా కే క్షణములో ఇవ్వాళ తెలిసిందో ఆక్షణములోనే నేను చెడగొట్టిన పేపరుకు సున్నచుట్టినా రనిపిస్తున్నది.


నా స్నేహితులలో ముగ్గురు బి. ఏ. కూ, ఒకరు యల్. టీ. కీ వెళ్లి తప్పతామని మళ్లీ పరీక్షకు చదువుతున్నారు. నన్ను ప్రేమతో చూస్తున్న మా బావమరది కూడా ఇంటరు ఐదవసారి తప్పిపోయినాడు. అంతా తప్పితే నే నొకణ్ణేనా ప్యాసయ్యేది!

కథ చెడిపోయినా ఫరవాలేదు, కాని నేను ప్యాసవుతే బాగుండు ననే కోరిక నాకు వస్తున్నది, తప్పదు. ఈమాటే నేనంటే ఇందాకా చంద్రు డిట్లా అన్నాడు: "లోకంలో జరిగే విషయాలు కాస్తన్నా మారుస్తేకాని కథలు కావండీ! లేకపోతే కవికల్పన ఏమున్నదీ? ఇంతవరకూ కథగా జరిగింది. పూర్తిగా జరగదు. చివరన్నా లోపము జరగకపోదు. నేను చెప్పుతున్నాను, మీరు ప్యాసవుతారుగా!"

చంద్రుడు చెప్పిన ఈ మాటలమీదనే నాకు ప్రధానంగా ధైర్య మున్నది. ఆ చంద్రునినోట బంగారము పండితే నేను త్రివేంద్రము వెళ్లి నా ఆరోగ్యము కొంత అర్పించుకోవలసిన అవసరం తప్పిపోతుంది.

చంద్రునిమాటలే గాక నాకు కొత్త ధైర్య మిచ్చేది ఇంకొకటి ఉన్నది. నేను పెద్ద పరీక్షలు దండ యాత్ర చేసే మామూలేగాని చిన్న పరీక్ష లెన్నడూ తప్పి ఎరగను. యఫ్. యల్. పరీక్ష పెద్దదా, చిన్న దా? ఇది తేల్చవలె. లాయర్లంతా ఏమంటారో! రెండుపక్షాలకూ తగిన సమాధానా లున్నవి. యూని వర్సిటీపరీక్ష కాబట్టి పెద్దదే. వేరే డిగ్రీ లేకపోవడం వల్లనూ, తప్పినా ట్రివేండ్రములో పై క్లాసులో చదివే వీలు ఉన్నందువల్లా ఇది చిన్న పరీక్షగా కనపడుతుంది.

ఈ వాద మంతా ఎందుకు? ఈ కథ అచ్చయ్యే వేళటికి అంతా తేలిపోయి ఉంటుంది!



ధర్మరాజరథము
[మహాబలిపురములోని పంచరథము లన్నింటిలోనూ పెద్దది]